# ఏ కన్నూ కానదని..!

## విచ్చలవిడిగా నిర్మాణ వ్యర్థాల పారబోత

- వ్యర్థాలతో చెరువులు, నాలాల్లోకి వెళ్లలేక రోడ్లపైకి వర్షపు నీరు
- నిలిచిన నీటితో దుర్గంధం ..స్థానికులకు తీవ్ర ఇబ్బందులు
- అధికారుల కళ్లుగప్పి వ్యర్థాలను తరలిస్తున్న బిల్డర్స్, ఇళ్ల యజమానులు
- జీహెచ్‌ఎంసీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్





రామంతాపూర్ నాలా పక్కన పారబోసిన నిర్మాణ వ్యర్థాలు

**రామంతాపూర్:** జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్ చిన్న చెరువు ఉప్పల్ నల్ల చెరువు, హబ్సిగూడ పెద్ద చెరువుతోపాటు దేవేందర్‌నగర్ నుంచి అంబర్‌పేట్ అలీకేఫ్ వరకు విస్తరించి ఉన్న నాలాకు దగ్గరగా సమీపంలోనే బాధ్యత రహితంగా కొంతమంది ఇంటి యజమానులు, బిల్డర్స్ కొత్త ఇళ్ల నిర్మాణం కోసం పాత గృహాలు కూల్చివేసినప్పుడు సిమెంట్, మట్టి తదితర వ్యర్థాలను భారీ ఎత్తున పారపోస్తున్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు ఈ నిర్మాణ వ్యర్థాలన్నీ చెరువులు, నాలాల్లోకి చేరుతున్నాయి. దీంతో వర్షాకాలంలో చెరువులు, నాలాల్లోకి చేరిన నీరు సక్రమంగా ప్రవహించకుండా రోడ్లపై వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిర్మాణ వ్యర్థాలను పారిశ్రామిక వేత్తలను చెరువుల్లో, నాలాల్లో పక్కన లారీలు, టిప్పర్ల ద్వారా తెచ్చి డంప్ చేసే వారిపై జీహెచ్‌ఎంసీ అధికారులు కఠిన చర్యలు తీసుకుని వ్యర్థాలు పారబోయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాం

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఉన్న చెరువులో నాళాల పక్కన కొంతమంది స్థానికులు బిల్డర్స్ కొత్త గృహాలను నిర్మించేందుకు పాత గృహాలను కూలిచ్చివేసినప్పుడు భారీఎత్తున వచ్చే వ్యర్థాలను సర్కిల్ పరిధిలోని చెరువులు, నాలాల పక్కన టిప్పర్లలో తెచ్చి పారబోస్తున్న విషయం వాస్తవమే. బాధ్యతారహితంగా నిర్మాణ వ్యర్థాలను పారబోస్తున్న వారిపై, పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. హెచ్చరిక బోర్డులు, సీసీ కెమెరాలు 24 గంటలు నిఘా ఏర్పాటు చేశాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలు పారబోస్తున్న వారికి మొదటిసారి పట్టుకుని రూ. 25 వేల రూపాయలు, రెండోసారి పట్టుకుంటే రూ.50 వేల జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు ఫైల్ చేస్తాం. అదే విధంగా వ్యర్థాల పారబోతకు వచ్చే టిప్పర్లను లారీలను సీజ్ చేస్తున్నాం. ఇంటి యజమానులు ఇంటి నిర్మాణం, ఇల్లు కూల్చి వేయగా వచ్చిన వ్యర్థాల సేకరణకు కలెక్షన్ పాయింట్ ఏర్పాటు చేశామన్నారు. ఇళ్ల నిర్మాణం కూల్చివేతలతో వచ్చే వ్యర్థాలను ఒక టన్నుకు రూ.407 చొప్పున చెల్లిస్తే టిప్పర్ ద్వారా జీహెచ్‌ఎంసీ తరపున ఎత్తాలని తరలిస్తాము. సంప్రదించవలసిన ఫోన్‌నెంబర్లు 18001201159. వాట్సాప్ నెంబర్ 9100927073లో సంప్రదించవచ్చు.

– ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు



వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫ్లెక్సీ

### వ్యర్థాలతో నాలా ఉనికికే ప్రమాదం



రామంతాపూర్ దేవేందర్‌నగర్ కాలనీ నుంచి అంబర్‌పేట్ అలీకేఫ్ వరకు విస్తరించి ఉన్న అతి పెద్ద నాలా పక్కనే నిర్మాణ వ్యర్థాలు భారీగా వేయడం వల్ల ఆ వ్యర్థాలు నాలాలోకి చేరి నీరు ప్రవహించకుండా ఒకే చోట నిలిచి ఉండటం వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పర్యావరణానికి ముప్పు కలగడంతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే అధికారులు స్పందించి నాలా పక్కన నిర్మాణ వ్యాప్తంగా కఠినమైన చర్యలు తీసుకోవాలి.

-దండు సంతోష్, శ్రీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రామంతాపూర్



నిర్మాణ వ్యర్థాల వల్ల జలమయమైన రోడ్డు

## పెండింగ్ పనులు ప్రారంభించాలి



మౌలాలి కార్పొరేటర్ సునీతాయాదవ్

**మల్కాజిగిరి:** మౌలాలి డివిజన్ పరిధిలో నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించాలని డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీతాయాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్టీసీ కాలనీ రోడ్డును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో అధికారుల తీరు అధ్వానంగా ఉందన్నారు. ఎన్నికల కోడ్ ఉందని, కాంట్రాక్టర్లు రావడం లేదని చెప్తుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఇప్పుడు కోడ్ కూడా ముగిసిందన్నారు. జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టరకు కూడా బిల్లులు చెల్లించినా పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదని ఆమె ప్రశ్నించారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అయినప్పటికీ ఇప్పటి వరకు డివిజన్ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. దీన్‌దయాళ్‌నగర్‌లో నాలా సమస్య పరిష్కరించాలని మూడు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని నాలాల్లో పూడిక పనులు జరగలేదని, ఆర్టీసీ కాలనీ రోడ్డు తవ్వి వదిలేశారని ప్రజలు ఇబ్బందులు కూడా అధికారులకు కనిపించడం లేదన్నారు. పరిస్థితి ఇలానే ఉంటే ప్రజలతోనే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టుతానని ఆమె హెచ్చరించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



బండ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

**అల్వాల్:** అల్వాల్ డివిజన్ బండ బస్తీలో శనివారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తాగునీటి సమస్య తదితర సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు తెలియచేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మల్లేష్‌గౌడ్, అరుణ్‌కుమార్, బస్తీవాసులు బిక్షపతి, జయంతి, విజయలక్ష్మీ, శోభ, లలిత, శ్రీలత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు




**ఉప్పల్:** ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యకమాలు ఆకట్టుకున్నాయి. నటరాజ కూచిపూడి డాన్స్ అకాడమీ సుప్రియ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గంధము పూయరుగా, మూషిక వాహన, ఆయిగిరి నందిని, అన్నమాచార్య కీర్తన, తదితర అంశాలను కళాకారులు మనస్వీ, వసుంధర,హాస హైన్థవి, సహాస్ర, ప్రణీత తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

## ఘనంగా ఆకుల రాజేందర్ జన్మదినోత్సవం




వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్

**మల్కాజిగిరి:** మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ జన్మదినోత్సవ వేడుకలు ఈస్ట్ ఆనంద్‌బాగ్ రామచంద్ర ఎన్‌క్లేవ్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ఆయన అభిమానులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మదార్సాలో చదువుతున్న చిన్నారులు ఈ వేడుకలకు హాజరయ్యారు.

## కృష్ణానగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



కృష్ణానగర్‌లో కాలనీవాసులతో మాట్లాడుతున్న ప్రభుదాస్

**కుషాయిగూడ:** స్థానిక సమస్యలపై శనివారం మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ కృష్ణానగర్ కాలనీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వీధులన్నీ తిరుగుతూ స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీలో నెలకొన్న మంచినీరు, డ్రైనేజీ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యకు గల కారణాలు తెలుసుకున్న కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్న నేరుగా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.



తెలంగాణ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (టీఎస్‌టీటీఏ) ఆధ్వర్యంలో స్టేట్ ర్యాంకింగ్ టెన్నిస్ స్టోరీ ఈసీఐఎల్‌లోని ఇన్‌స్పైర్ అకాడమీలో ప్రారంభమైంది. టీఎస్‌టీటీఏ అధ్యక్ష, కార్యదర్శులు కేకే మహేశ్వరి, పి.నాగేందర్ రెడ్డి ఈ టోర్నీని ప్రారంభించారు. - సాక్షి, హైదరాబాద్

## సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌కు వినతి

**కాప్రా:** కాప్రా డివిజన్‌లోని దాబా గార్డెన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానిక కాలనీ వాసులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ విషయంపై శనివారం కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిని కలిసి వినతిపత్రం అందించారు. కాలనీల పర్యటనలో భాగంగా దాబా గార్డెన్ కాలనీని సందర్శించిన కార్పొరేటర్ స్వర్ణరాజ్ స్థానికులను సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. దీంతో కాలనీలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు నెలకొన్నాయని, కాలనీలో పార్క్‌ను కూడా అభివృద్ధి చేసి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కాలనీవాసుల వినతిపై స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే సమస్యలన్నీ పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమస్యలపై కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

## ప్రజల ఫిర్యాదులు పరిష్కరించండి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రవణ్

**మల్కాజిగిరి:** ఎన్నికల కోడ్ ముగిసిందని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అధికారులకు సూచించారు. శనివారం శివపురి కాలనీలోని తన కార్యాలయంలో ప్రజలు సమస్యలు తెలియజేసేందుకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలను తెలియజేశారు. అనంతరం కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు దాదాపు ఏడు నెలలు ఎన్నికల కోడ్ ఉండడంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల్లో అర్హులున్నపటికీ వారికి ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ అందలేదని దరఖాస్తును పునఃపరిశీలన చేయాలన్నారు. వానాకాలం ప్రారంభమైందని విద్యుత్ అంతరాయం లేకుండా చెట్ల కొమ్మల తొలగింపుతో పాటు వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. నాలాల్లో పూడిక, మూతల్లేని మ్యాన్‌హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేయాలన్నారు. ఫుట్‌పాతలను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అవుతుందని కొత్త పింఛన్లతోపాటు పెండింగ్ ఫించన్లు మంజూరు చేయాలన్నారు. నిధులు మంజూరైన ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కుషాయిగూడ:** చర్లపల్లి సబ్‌స్టేషన్–2 పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం పలు ఫీడర్ల పరిధిలో కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం. పృథ్వీరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్‌రైజర్స్, డైనటెక్ 11 కేవి ఫీడర్ల పరిధిలోని ఫేస్–2 ఏరియా, ఫేస్–2 సెక్టార్–3 ప్రాంతాల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, దేవి హైటెక్, విమ్టా ల్యాబ్ 11 కేవి ఫీడర్ల పరిధిలోని ఫేస్–2 సెక్టార్–1 ఏరియాల్లో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు కరంటు ఉండదన్నారు.

## రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

**రామంతాపూర్:** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రజలలో యోగా ఆరోగ్యం, ఆహార నియమాలు చక్కని జీవన శైలి విషయాల మీద అవగాహన కలిగించేందుకు రామంతాపూర్‌లోని బాలభారతి పాఠశాల ప్రాంగణంలో జూన్ 10 తేదీ నుంచి 22వ తేదీ వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ యోగా నిపుణులు థెరపిస్ట్ డాక్టర్ దొడ్ల సత్యారెడ్డి శనివారం తెలిపారు. ఈ ఉచిత తరగతులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ ద్వారా కూడా నిర్వహిస్తున్నామని వివరాలకు 9246173775లో సంప్రదించాలన్నారు.

## బోడుప్పల్‌లో రేపు ప్రజావాణి

**బోడుప్పల్:** మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కమిషనర్ రామలింగం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతి సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు



రాజేందర్‌ను సత్కరిస్తున్న నేతలు

**బోడుప్పల్:** బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులుగా ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా పలువురు బోడుప్పల్ నేతలు ఆయన కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తమ గెలుపు కోసం కృషి చేసి కార్యకర్తలు, నాయకులకు ఆయన రుణపడి ఉంటానన్నారు. ఈటల రాజేందర్‌ను కలిసిన వారిలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్, నేతలు మునిపాల పురుషోత్తం, పప్పు రాంసూరి, సాయి నరేందర్, ప్రభాకర్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

## లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు

**కుషాయిగూడ:** లోక్ అదాలత్‌లతోనే సత్వర న్యాయం సాధ్యమవుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వి. బాల భాస్కర్‌రావు అన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, తెలంగాణ న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై లోక్ అథాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. ఎలాంటి బేషాజాలకు పోకుండా లోక్ అదాలత్‌లను ఆశ్రయించి సత్వర న్యాయం పొందాలన్నారు. ఈ సందర్భంగా క్రిమినల్, మోటారు ప్రమాదాలు, గృహహింస, చెక్ బౌన్స్, ప్రీ లిటికేషన్ వంటి పలు కేసులను పరిష్కరించారు. 23 బెంచుల్లో జిల్లా వ్యాప్తంగా 32 సివిల్ కేసులు, 80499 అన్ని రకాల క్రిమినల్ కేసులు, 30075 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించి 62,82,768 లక్షల రూపాయలను పరిహారం కింద చెల్లించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటవ జిల్లా అదనపు న్యాయమూర్తి ఆర్. రఘునాథ్‌రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డి. కిరణ్‌కుమార్, డీసీపీ ఉషారాణి, జిల్లా కలెక్టరేట్ న్యాయ అధికారి ఆర్.ఎస్. చంద్రావతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరిహారం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు తదితరులు

## వెంటనే రుణమాఫీ చేయాలి

**ఘట్‌కేసర్:** ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతు రుణమాఫీ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఎంపీటీసీ శోభారాణి దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లో శనివారం ఆమె మాట్లాడుతూ గద్దెనెక్కిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మహిళలకు రూ. 2,500, 200 యూనిట్లలోపు ఉచితంగా విద్యుత్ సరఫరా, పెన్షన్ పెంపుదల అమలు కాలేదని గుర్తు చేశారు.

## డ్రగ్స్ విక్రయదారుడి అరెస్టు

**సాక్షి, సిటీ బ్యూరో:** డ్రగ్స్ అమ్మటానికి ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధి మల్కాజిగిరి, మమీర్జాలగూడ ప్రాంతంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద ఎండి. అబ్దుల్ మొబిన్ ఎల్‌ఎస్‌డీ డ్రగ్స్‌ను విక్రయించడానికి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మొబిన్‌ను తనిఖీ చేయగా అతని వద్ద ఎల్ఎస్‌టి 25 ప్యాడ్స్, 1.28 గ్రాముల ఎల్‌ఎస్‌జి డ్రగ్స్ లభించాయి. అయితే 0.01 పేపర్‌ను నాలుకపై పెట్టుకుంటే సుమారు 20 గంటలపాటు వ్యక్తి మత్తులో ఉంటాడు. అతి ప్రమాదకరమైన ఎల్‌ఎస్‌టి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, చట్ట ప్రకారం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ ఎస్‌టీఎఫ్ ఎక్సైజ్ సూపరింటెండ్ ప్రదీప్‌రావు, మల్కాజిగిరి ఎక్సైజ్ సూపరిండెంట్ నవీన్‌కుమార్‌ల సంయుక్తాధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

## హైవేపై మందుబాబు చిందులు



**మేడ్చల్‌రూరల్:** మద్యం మత్తులో ఉన్న ఓ తాగుబోతు జాతీయ రహదారిపై వీరంగం సృష్టించాడు. ఈ ఘటన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో వద్ద 44 జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. అతడి తలకు గాయమై రక్తం కారుతున్నా నడిరోడ్డుపై పడుకొని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించాడు. పక్కకు జరగాలని, గాయాలకు చికిత్స చేసుకోవాలని వాహనదారులు సూచించగా, వారిపై చిందులు వేశాడు. తనపై ఒకరు దాడి చేశాడంటూ బూతులతో హంగామా చేశాడు. స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా సంఘటన స్థలికి చేరుకుని అతడికి చికిత్స నిర్వహించారు. ఆఖరికి అంబులెన్స్ సిబ్బందిపై కూడా అతడు చిందులేశాడు. పోలీసులు రాకుండానే చికిత్స ఎందుకు చేశారంటూ నానా యాగీ చేశాడు.

## ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



యమున (ఫైల్)

**మేడిపల్లి:** ఇంటినుంచి బయటకు వెళ్ళిన తల్లితో సహా ఇద్దరు పిల్లలు అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా పాలకుర్తి గ్రామంలో నివాసముంటున్న దర్మవరపు యమున తన ఇద్దరి కూతుళ్లతో కలిసి గత నెల 30వ తేదీన నగరంలోని పీర్జాదిగూడ చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్ కాలనీలో ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటుంది. అయితే ఈనెల 5వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా యమున తన ఇద్దరి పిల్లలతో సహా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారివద్ద ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్

**అల్వాల్:** ఓల్డ్ అల్వాల్‌లోని పురాతన శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నరసయ్య, నరేష్, సురేందర్‌రెడ్డి, నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేయండి

**కీసర:** దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నివసించే ప్రజలు సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో అర్జీల రూపంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## సమస్యల పరిష్కారమే ధ్యేయం

### పలు కాలనీల్లో పాదయాత్ర చేసిన మేయర్ జక్క వెంకట్‌రెడ్డి



మల్లికార్జుననగర్‌లో పర్యటిస్తున్న మేయర్ జక్క వెంకట్ రెడ్డి

**మేడిపల్లి:** కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ బచ్చరాజుతో కలిసి మల్లికార్జుననగర్, రాఘవేంద్ర కాలనీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్ల అభివృద్ధికి కృషిచేస్తూ నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాలనీలో నెలకొన్న సీసీరోడ్డు నిర్మాణం, మంచినీటి సరఫరా కోసం పాత పైపులైన్ ఉండటం వల్ల తరచుగా లీకులతో మంచినీరు వృథాగా పోవడంతో సరిపడా నీరు అందడం లేదని కాలనీవాసులు చెప్పడంతో త్వరలోనే నూతన పైప్‌లైను నిర్మాణం కోసం జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేయడంతో పాటు భవిష్యత్ అవసరాల దృష్ట్యా గతంలో ఉన్న 40 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు, రిజర్వాయర్లకు అదనంగా మరో 90 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు నిర్మాణం చేయడం జరిగిందని వీటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో నగర ప్రజలకు మంచినీటి సమస్యలు తీరుతాయని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరగడంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో వాటిని తక్షణమే సరిచేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొడె పోచయ్య, పార్టీ అధ్యక్షుడు బండారి రవిందర్, ఏనుగు మనోరంజన్ రెడ్డి, చిర్ర సంతోష్, సత్యం, సంజీవ రెడ్డి, కాలనావాసులు తదితరులు పాల్గొన్నారు.